# మేలొన్న మానవత్వం

సుస్మితా రమణమూర్తి

## 1

"అన్నయ్యా! స్కూలుకి ఫీజు కట్టాలి...." చిరాగ్గా చూస్తున్న చక్రవర్తి కళ్ళల్లోకి చూసిన రవి మరేమీ చెప్పలేక పోయాడు.

"ఎప్పట్లోగా కట్టాలిరా?"

"రేపట్లోగా!"

"స్సరే! నేకడతాలే! నువ్ స్కూలు కెళ్ళు!"

"అలాగే అన్నయ్యా!" అంటూ రవి స్కూలుకి వెళ్ళి పోయాడు.

"బాబూ!" అన్న పిలుపు విని ఇంట్లోకి వెళ్ళాడు చక్రవర్తి. ఆప్యాయతతో నిండిన ఆ పిలుపు చక్రవర్తి తల్లిది.

"ఏం కావాలమ్మా?" అంటూ తల్లి మంచంమీద కూర్చుంటూ అడిగేడు చక్రవర్తి.

"తమ్ముడు స్కూలుకి వెళ్ళేడా?"

"ఆఁ!"

"వాడి ఫీజు కట్టడానికి రేపేనట - ఆఖ్రరోజు! నెలాఖరు కూడా! ఎలా కడ్తావురా వాడి ఫీజు?"

"అవన్నీ నీ కెందుకమ్మా? నీవు నిశ్చింతగా వుండు. నే చూసుకుంటాగా అదంతా!" అంటూ తన టిఫిన్ బాక్సుని తీసుకుని, "నేను ఆఫీసుకి పోతున్నా! జాగ్రత్త!" అంటూ ఆఫీసుకేసి నడక సాగించేడు-చక్రవర్తి.

## 2

చక్రవర్తి బి. ఏ. ఫస్టుక్లాసులో మూడేళ్ళ క్రితం పాసయ్యేడు. ఓ ప్రైవేట్ కంపెనీలో ప్రస్తుతం మెసెంజర్ ఉద్యోగం చేస్తున్నాడు. ముప్పైరోజులయ్యేసరికి వందరూపాయలొస్తాయతనికి.

ఫస్టుక్లాస్ డిగ్రీలకన్నా-కాసులకు-రికమండేషన్లకే ప్రాధాన్యతున్న ఈ రోజుల్లో చక్రవర్తి-బి. ఏ. కి మూడేళ్ళ నుంచి సరైన ఉద్యోగం లేకపోవడం వింత కాదనుకుంటాను.

## 3

ఆఫీసులో గంట గణగణమని మ్రోగింది.

అది కాఫీ.... టీ....లకి విరామ సంకేతం!

వర్కర్సంతా లేచి దగ్గర్లోవున్న కేంటీన్‌కి వెళుతుంటే చక్రవర్తికూడా స్టోర్‌ని వదలి వారిని అనుసరించాడు.

"రంగన్నా? ఓఁయ్ రంగన్నా! ఎక్కడ్రా?...." అంటూ అరచేడువిశ్వం.

"ఆఁ' ఈడనేవున్నాబాబూ" అంటూ రంగన్న వినయంగా చేతులు కట్టుకుని నిల్చున్నాడు విశ్వం ఎదురుగా.

"వెళ్ళొస్తాయింగ్ కాఫీ పట్రా!"అంటూ ఓ రూపాయి కాగితం ఇచ్చేడు విశ్వం.

విశ్వం ఆ ఆఫీసులో సూపర్‌వైజరు. మూడుపదులు నిండినవాడైనా రెండు న్నర వాడిలా కన్పిస్తాడు. ఉద్యోగం చేయాల్సిన అవసరం లేకపోయినా 'హాబీ' కోసమే ఉద్యోగం చేస్తున్నానంటాడు — అందరితోను, నెలలో మొదటి వారానికి— ఆఖరి వారానికి తేడా తనకితెలీదు. కారణం–అతని పాకెట్లోంచి ఎప్పుడూ కొన్ని పదులు చూపరులను చూసి ఫక్కున నవ్వుతుంటాయ్. ఇంచుమించు ఆఫీసు లోని వారంతా అవసరమైనపుడల్లా విశ్వం దగ్గర అప్పుతీసుకుంటుంటారు. "పేకాట పుట్టికే ఆడితే రంజుండదోయ్! అలాగే అప్పనేదుంది చూశావ్! వడ్డీ లేకుండా ఇవ్వడమనేది అందంగా వుంటదోయ్!" అంటూ నవ్వుతునే మొదటి నెల వడ్డీని అప్పిస్తున్న పైకంలోంచే తీసుకుంటుంటాడు విశ్వం.

మూణ్ణెల్లక్రితం చక్రవర్తికూడా అందరిలా తన అవసరానికి ఓ యాభై రూపాయలు విశ్వం దగ్గర అప్పుతీసుకున్నాడు. కానీ అనుకున్న టైంకి అసలు కాదుగదా, వడ్డీకూడా ఇవ్వలేకపోయాడు

విశ్వంకి చిర్రెత్తిపోయింది ఎన్నిసార్లడిగినా వచ్చేనెల్లో తప్పకుండా ఇచ్చేస్తాననడం – తీరా ఆ రోజు వచ్చేసరికి ఇవ్వలేకపోవడం జరుగుతున్నందుకు చక్రవర్తి లోలోన తన అసమర్థతకి బాధపడ్డం తప్పించి మరేఁవీ చేయలేకపోయాడు. తను మాత్రం ఏం జేయగలడు?

మళ్ళీ గంట గణగణమని మ్రోగింది. 'అది' ఇంట్రవల్ సమాప్తికి సంకేతం!

విశ్వం తన గదిలోనుంచి రంగన్న కోసం—"ఓయ్, రంగన్నా, ఎక్కడున్నావోయ్?" అంటూ అరిచేసరికి రంగన్న ఆత్రంగా వచ్చి, "ఏవిఁటి బాబూ?" అంటూ విశ్వంకేసి చూస్తూ నిల్చున్నాడు

రంగన్న ముఖంలోకి తీక్షణంగా చూస్తూ, "డబ్బు పోయింది!" అన్నాడు విశ్వం.

"ఆఁ! నిజంగానా!!?." "నమ్మలేనట్టు ముఖంపెట్టి అన్నాడు రంగన్న.

"నిజంగాక అబద్ధమాడతాననుకుంటున్నావా?" విశ్వం మండిపడ్డాడు.

"అదికాద్బాబూ! ఇలాంటి దెపుడూ నా ఎరికలో జరగలేదు. అందుకని...."

"సర్లే! వెంటనే మనవాళ్ళందర్నీ నే రమ్మన్నానన్చెప్పి ఇక్కడికి పంపించు."

"అలాగే బాబూ!" అనేసి రెండడుగులు ముందుకి వేసిన వాడల్లా ఠపీమని ఆగిపోయి—

"బాబూ ఇంతకీ ఎంతపోయింది?" అమాయకంగాను, అనుమానంగాను అడిగేడు.

"యాభై!" ముక్తసరిగా అన్నాడు విశ్వం.

"ఆఁ! యాభై రూపాయలే!!" అంటూ మరోసారి ఆశ్చర్యపోయేడు రంగన్న. క్షణాల మీద ఈ వార్త కార్చిచ్చులా ఆఫీసులో అందరికీ ప్రాకిపోయింది.

ఐదు నిముషాల్లో విశ్వం గదిలో

వర్కర్సందరితో బాటు చక్రవర్తి కూడా హాజరయ్యేడు. అందర్నీ వుద్దేశించి విశ్వం అన్నాడు : "ఇటువంటి సమయం వస్తుందని—ఇలా మీరంతా నాముందు ఒకరు చేసిన నేరానికి విల్చోవాల్సి వస్తుందని నేను కలలో కూడా అనుకోలేదు. డబ్బు పోయినందుకు కాదు నా విచారం! మనలో ఒకరు అకారణంగా – అకస్మాత్తుగా నీచాతి నీచమైన దొంగతనమనే వ్యసనానికి బానిసైనందుకే నా యీ బాధంతా! అందరం దొరలమే! దొరికితేనే దొంగలం!!

"అవసరం మనిషిని పిచ్చివాణ్ణి చేస్తుంది. ఆ వుద్రిక్తతలో తనేం జేస్తున్నాడో తెల్సుకోలేడు మనిషి. అలాంటి పరిస్థితికి లోనై మీలో ఎవరో ఒకరు ఈ పనిచేసి వుండాలి. అంతగా అవసరమైతే నన్నడిగితే కాదంటానా? ఆ అవకాశం నాకీయకుండా ఇలా చేసిన ఆ వ్యక్తి మీద అసహ్యం వేయటానికి బదులు జాలివేస్తోంది. కారణం – మనిషి ఎప్పుడూ పరిస్థితులకి బానిసేకనుక! కనుక ఆ తప్పుచేసిన అతనికి తప్పు దిద్దుకునే అవకాశం ఇస్తున్నాను." అంటూ అందరి ముఖాల్లోకి గుచ్చి గుచ్చి చూడసాగేడు విశ్వం.

అంతా సజీవ శిల్పాలైపోయారు.

క్షణాలు నిముషాలుగా మారిపోతున్నాయి.

తనాశించినట్లు ఏమీ జరుగనందుకు విశ్వం మండిపడుతూ అన్నాడు! "నా డబ్బుని ఎలా రాబట్టుకోవాలో నాకు బాగా తెల్సు. ఐనా మరో ఐదు నిముషాలు టైమిస్తున్నాను. నా డబ్బుని తీసినవాళ్ళెవరో మర్యాదగా ఇచ్చివేయండి. లేకుంటే రంగన్నద్వారా అందర్నీ సోదా చేయాల్సొంటుంది.

శిల్పాల్లో చలనం చోటుచేసుకుంది.

"సూపర్రైజరుగోరూ! మీ కంత అనుమానం వుంటే తనిఖీ సేసుకోండి!" అన్నాడొకడు.

"అవునండి! తనిఖీ సేసుకోండి. మాకేం భయంవా?" అంతా ఒక్కసారన్నారు.

విశ్వం అనుమతితో రంగన్న అందరి జేబుల్నీ తనిఖీ చేయసాగాడు. అందర్నీ సోదా చేసినం తర్వాత– రంగన్న చక్రవర్తి దగ్గరకొచ్చి విశ్వంతో అన్నాడు. "బాబూ! ఈ బాబుని తప్పించి అందర్నీ తనిఖీ చేశానండి. యాభైరూపాయలు కాదుగదా అయిదంటే అయిదు రూపాయలు కూడా ఎవ్వరి దగ్గరా నేవండి!"

"ఏంవిటో!? అంతా మాయగావుంది. నాకు బాగా గుర్తు. ఈ సొరుగు లోనే పెట్టాను. పెట్టిన డబ్బు పెట్టిం దగ్గరా లేక– ఎవరూ తీయక పోతే; ఇంతకీ ఏంవైనట్లు!?" అని విసుక్కుంటూ రంగన్నతో అన్నాడు విశ్వం : "స్సరే! ఆయన్నీ కూడా కానియ్!"

చక్రవర్తి అసహనంగా నిల్చున్న చోట్లో కదిలేడు.

ముఖమంతా చెమటతో నిండిపోయింది.

కళ్ళల్లో కన్నీటితెర చోటుచేసుకుంది.

'నన్ను కూడానా!!' అంటూ బాధతోను – అవమానంతోను కృంగిపోయాడు.

రంగన్న సంశయిస్తూ తనకేసి

చూస్తుండటంతో చక్రవర్తి తనపర్స్‌తీసి విశ్వం టేబుల్ మీద పడేశాడు-అసహనంగా రంగన్న ఆత్రంగా పర్స్ తెరచి చూశాడు. అందులో కొన్నినోట్లు కన్పించే సరికి రంగన్న స్వగతంలా అన్నాడు. "సక్రవర్తి బాబుగోరికాడ నెలాకరైనా సాలా డబ్బుందే !!" వెంటనే విశ్వం కళ్ళుమూసుకుని-"రంగన్నా! పోయిన నా యాభై రూపాయల్లో మూడు సరికొత్త పదులు- రెండు ఒకమాదిరిక్రొత్త ఐదునోట్లు-ఐదుపాతబడిన రెండునోట్లు" అని గుక్క తిప్పుకోకుండు చెప్పేసి, కళ్ళువిప్పి ఆ నోట్లకేసి చూశాడు.

"బాబూ ? తమరన్నట్లు ఈ పర్సులో వున్నవి అచ్చరాల మూడు కొత్తపదులు-రొండయిదులు - ఐదు రొండ్లు !!...." ఆశ్చర్యపోతూ చెప్పేడు రంగన్న. అందరికీ చక్రవర్తి మంచివాడని అభిప్రాయమున్నా ప్రత్యక్షంగా కన్పిస్తున్న నిజం చూసేసరికి అందర్లోంచి ఇదివరకటి సదభిప్రాయం క్షణాల్లో రెక్కలు కట్టుకొని ఎగిరిపోయింది.

"అః !! చక్రవర్తి ఇంత పన్జేశాడా!? నమ్మశక్యం కాకుండా వుందే :!

"ఇంకా చేశాడా ? - అని అంటావేంట్రా ? ఎదురుగుండా కనిపిస్తుంటేను!"

"ఏమిటో ? ఈ రోజుల్లో ఎవర్ని నమ్మాలో — ఎవర్ని నమ్మకూడదో తెలియకుండా పోయింది :"

"అవున్రా!"

"ఒరేయ్! ఈ బాబు.... ఛ! ఛ!! ఇంకా బాబేమిటి? పీడిలాంటి పన్జేస్తాడని కలలో కూడా అనుకోలేదురా!!"

రకరకాల వ్యాఖ్యానాలు అందరినోటంట వస్తూంటె చక్రవర్తి దోషిలా అందరిముందు నిల్చుండిపోయాడు.

అందర్నీ ఒకసారి విశ్వం కలియజూసి చక్రవర్తి భుజంమీద చేయివేసి అన్నాడు: చక్రవర్తీ! నీవిలా చేయడానికి పరోక్షంగా కారకుణ్ణి నేనేకదూ ? - అవును నేనే! నిన్న నీవు అడిగినట్లు యాభై రూపాయలు అప్పిచ్చినట్లయితే ఈ రోజు నీవిలాచేసివుండేవాడివికాదు. తప్పంతా నాదే! నీవిలా కావడానికి కారకుణ్ణి నేనే !

"ఇదివరకు నీవు తీసుకున్న డబ్బుని తిరిగి ఇవ్వకుండా మళ్ళీ అప్పు అడిగితే నీకు నేను డబ్బెందుకు ఇవ్వలేదోతెల్సా? అలా నీ వడిగినప్పుడల్లా అప్పివ్వడం జరిగితే - క్రమేపి నీకు అప్పుతీసుకోవడమనేది అలవాటుగా మారుతుందేమోనని - నేన్నీకు డబ్బివ్వలేదు. కానీ నీకు డబ్బు నిజంగా అంత అవసరమని నాకు తెలీదు. ఏది ఏమైనా నీవు చేసిందేవీ బాగులేదు. అవకాశమిచ్చినా ఉపయోగించుకోక నీ మూర్ఖత్వాన్ని చాటుకున్నావ్. ఇప్పటికైనా చేసిన తప్పుని ఒప్పుకుంటే - ఈ విషయం ఇక్కడితోనే 'గుప్‌చిప్' చేసేస్తాను. లేకుంటే మేనేజరుగారిదాకా వెళ్లాల్సొస్తుంది. మేనేజరుగా రెటువంటివారో నీకు నేను వేరే చెప్పాల్సిన అవసరం లేదనుకుంటాను. ఆయనకీ విషయం గన్క తెలిస్తే నీ ఉద్యోగానికి తిలోదకా లిచ్చుకోవాల్సి వస్తుంది. నా మూలకంగా నీ ఉద్యోగం పోవడం నాకిష్టంలేదు. బాగా ఆలోచించుకో !"

విశ్వం చక్రవర్తికేసి రెప్పలార్ప

కుండా చూస్తుంటే - మిగతా వారంతా వారిద్దర్నీ మార్చి మార్చి చూడసాగేరు.

రెండు నిముషాలు ముందుకి జరిగాయ్.

"సార్! మీ ఇష్టమొచ్చినట్లే చేసుకోండి, మేనేజరుగారికే కాదు-మరెవరికైనా రిపోర్టు చేసుకోండి. నాకేం భయంలేదు, నేను మీ డబ్బుని తీయలేదన్న నిజం నా అంతరాత్మకి తెల్సు, నేను మీ అందరి ముందు దోషిలా నిల్చునే అగత్యం నాకేం పట్టలేదు. డబ్బుమీ ఒక్కరిదగ్గరేవుండాలి?ఉంటుంది అనేం లేదు! నాదగ్గర డబ్బున్నంత మాత్రాన అది మీదే ననుకోవడం కేవలం అవివేకం! 'ఉద్యోగం పోవడం గ్యారంటీ!'అని మీరుచెబుతున్నా' ఏంవిటితవి మూర్ఖత్వం?' అని అందరూ అనుకుంటున్నా - నేనింకా ధైర్యంగా వున్నానంటే అందరూ ఆశ్చర్యపోతున్నారు కదూ? అందుక్కారణం - మీ డబ్బుని నేను తీయకపోవటవే నని గ్రహించండి!" అంటూ సమాధానంకోసమైనా ఎదురు చూడకుండా తన పర్సుతీసుకుని స్టోర్ రూంకి వెళ్ళిపోయాడు చక్రవర్తి.

రెండుగంటల్తర్వాత మేనేజర్‌గారు రావడం-విశ్వం డబ్బు పోయిన విషయం అతనికి తెలియడం జరిగిం తర్వాత— రంగన్న ద్వారా చక్రవర్తిని వారు పిలిపించడం జరిగింది.

చీకాకుపడ్తూ-తన దురదృష్టాన్ని నిందించుకుంటూ చక్రవర్తి వాళ్ళ కెదురుగా చేతులు కట్టుకుని దోషిలా నిల్చున్నాడు.

విశ్వం.... మానేజర్‌గారు ప్రక్కప్రక్కనే కూర్చున్నారు.

వారి ఎదుట చక్రవర్తి,

చక్రవర్తి ఇంతకు ముందెప్పుడూ మేనేజర్ గారితో మాట్లాడి ఎరుగడు, ఆ అవసరం తనకెప్పుడూ కలుగ లేదు. మేనేజర్‌గా రెటువంటి వారో తనకి నిజంగా తెలీదు, చాలా స్ట్రిక్ట్‌గా వుంటారని తోటి పనివారు అనుకోగా విన్న చక్రవర్తి, తనను యేంవిటంటారో? అన్న దిగులు అతనిలో యేర్పడింది.

నిశ్శబ్దాన్ని చీలుస్తూ మానేజర్‌గారన్నారు. "మిష్టర్, చక్రవర్తీ! ఇంతవరకు ఈ ఆఫీస్‌లో ఇటువంటి దేఁవీ జరుగలేదు. కాని ఈనాడు జరిగింది. ఒక్క విషయం జాగ్రత్తగా విను. నీకు కనుక ఆ డబ్బే కావల్సొస్తే-డబ్బుని తీసుకుని, రేపట్నుంచి ఆఫీసుకు రావడం మానేయ్! అలాగాక చేసిన తప్పు ఒప్పుకుని ఆడబ్బుని విశ్వంగారికి ఇచ్చేస్తే - మొదటి తప్పుగా క్షమిస్తాం, బాగా ఆలోచించుకుని ఓ నిర్ణయానికి రా!"

మేనేజర్‌గారిమాటల్లోని తీవ్రతని బెదిరింపుని-అధికారాన్ని గ్రహించిన చక్రవర్తి అదకత్తెరలో పోకచెక్కలా బాధపడ్డాడు.

తను చేయని నేరాన్ని తనెలా ఒప్పుకుంటాడు? తను క్రిందటిరోజు విశ్వాన్ని డబ్బు అప్పడగటం ఎంత పొరబాటైంది? తన పర్సులో డబ్బు తనదేనని - అదెలా వచ్చిందో-ఎవరి దగ్గర తీసుకుందో మాత్రం తెలియజేస్తే వీరు నమ్మతారా? విశ్వంగారు కళ్ళుమూసుకుని చెప్పినట్లుగ ఆ నోట్లే తన దగ్గర కూడా వుండటం చాలా ఆశ్చర్యంగా వుందే! ఇప్పుడు

తనేం జేయాలి ? ?....

అలా ఆలోచనా స్రవంతిలో కొట్టుకు పోతున్న చక్రవర్తితో మేనేజర్‌గారు మళ్ళీ అన్నారు : "మిస్టర్ చక్రవర్తీ ! మౌనం వహించారేం ? మౌనం అంగీకార సూచననా ?"

సార్! నిన్న నా అవసరానికి సరిగ్గా యాభై రూపాయలు అడగటం - మీరు లేవనడం–ఈ రోజు నా పర్సులో మీరు కళ్ళు మూసుకుని చెప్పిన నోట్లే వుండటం - నన్ను దోషిగా మీ ముందు నిల్చునేటట్లు చేశాయ్. కాని మిమ్మల్ని అడిగినట్లే మరొకర్ని అడిగిగాని –మరో విధంగా కాని నేను ఈయాభై రూపాయలు సంపాదించానని మాత్రం మీరనుకోరేం? ఈ విషయం మీ పెద్ద బుర్ర(ల)కి తట్టకపోవడం - మీరు చెప్పిన నోట్లే నా దగ్గరుండటం నా దురదృష్ట మేమో? డబ్బు అందరిదగ్గరా వుంటుంది. అది మీదే ననుకోవడం– చేయని నేరాన్ని నాకాపాదించడం ఎంతైనా మీకే చెల్లు? నేను నిర్దోషినని నా అంతర్మాకు తెల్సినా ఒకసారి నామీద పడిన ఈ 'దొంగ' మార్క్–ని నేను సహించలేను. రేపటిదాకా ఎందుకు? ఇప్పుడే నా ఈ లక్షల విలువచేసే వుద్యోగానికి రాజీనామా ఇచ్చేస్తాను.

"నిర్దోషిని - దోషిగా నిలబెట్టిన ఈ వాతావరణం మధ్య - పరిస్థితుల్ని అర్థం చేసుకునే విచక్షణా జ్ఞానం కొరవడిన ఈ వింత మనుషుల మధ్య ఇంకా గనుక వుంటే - నిజంగా మీ రంటున్నట్లు 'దొంగ'గా మారిపోతానేమో ? ఎంతయినా ఆర్నెల్లు సావాసం చేస్తే - వారు వీరవుతారట, కానీ మీతో ఎంతోకాలం నుంచి పనిసేస్తున్నా నేనలా కానందుకు నాకు చాలా సంతోషంగా వుంది. గుడ్‌బై!" అంటూ వాళ్ళ ముందు నుంచి విసురుగా వెళ్ళి పోయాడు చక్రవర్తి.

ఐదు నిముషాల తర్వాత రంగన్న తీసుకొచ్చిన కాగితాన్ని చూసిన మేనేజర్‌గారూ, సూపర్‌వైజరు విశ్వం విస్మయంతో ఒకరి ముఖాలనొకరు చూస్తుండిపోయారు.

అది చక్రవర్తి రాజీనామా!

* * *

రెండు ముడుకుల్ని పైకి లేపి–వాటిని చేతుల్తో బంధించి–ముడుకుల మధ్య తలను ఆన్చి బీచ్‌లో ఒంటరిగా కూర్చున్న చక్రవర్తి చూపులు ఎగిరెగిరి పడుతున్న కెరటాలమీద లగ్నమయాయ్.

కెరటాలవేపు తదేకంగా చూస్తున్న చక్రవర్తి పరిసరాలను కూడా మరచిపోయాడు. తల్లి అనారోగ్యం గురించిగాని ఉద్యోగంలేక తనుకట్టలేకపోయిన రెండు నెలల ఇంటద్దె గురించిగాని–తన తమ్ముడి చదువు గురించి గాని–ఆత్రం–బాధ.... ఇప్పుడతనిలో లేవు. కారణం–చక్రవర్తి తాత్కాలికంగా అన్నిటినీ మరచి ప్రకృతిలో లీనం కావడమే!

అంతవరకు నిరాటంకంగా సాగిన చక్రవర్తి సమాధికి అడ్డంకు ఏర్పడింది. అతని మిత్రుడు సురేష్ చక్రవర్తి ముఖంలోకి ముఖం పెట్టి, "ఏంట్రా,– బ్రదర్! తపస్సుగాని చేస్తున్నావా యేమిటి !? అరగంటనుంచి చూస్తున్నాను - నీవీ లోకంలోకి వస్తావని! ప్రక్కనే కూర్చున్న నన్నుపలుక

తీస్తావని!! అబ్బే! నీ చూపులు– ఆలోచనలు ఈ పరిసరాల్లో వుంటేనా?– నన్ను చూడ్డానికి ! పలకరించడానికి ! ! "అని గట్టిగా ఒళ్ళంతా కుదిపి అడిగేసరికి చక్రవర్తి ఈ లోకంలోకి వచ్చిపడ్డాడు.

చక్రవర్తి సురేష్ వేపు చూస్తూ, "ఎంతసేపైందిరా వచ్చి?"

అడిగేడు.

అరగంట కావస్తోంది: మొదట నీవేదో తీవ్రంగా ఆలోచిస్తున్నావు కదాని కొంతసేపు ఎదురుజూశాను– నీవీ లోకంలోకి వస్తావేమోవని ! ఇంతకీ ఏంవిటిలా వున్నావ్ ? ఇంకా ఆ వుద్యోగంవేనా? లేక మార్పేవైనా వుందా?"

"....................."

"సురేష్ ! నిన్ను అప్పడిగిన రోజు గుర్తుందా ?

"అవునూ ఇంతకీ ఆ రోజు సంగతి ఇప్పుడెందుకు ?"

"ఆ రోజు నీ విచ్చిన డబ్బులోంచి అవసరమైన కొన్ని బాకీలుతీర్చగామిగిలిన యాభై రూపాయలు పర్సులో వుంచుకుని – ఆ మర్నాడు ఆఫీసుకు వెళ్లాను.

ఆ యాభైలో ఇంటద్దెకు ముప్పై రూపాయలు – ఇదివరలో మా సూపర్ వైజర్ విశ్వంగారి దగ్గర తీసుకున్న యాభై రూపాయలకి ఓ ఇరవై రూపాయలు జమ కద్దామనుకున్నాను. నేననుకున్నందుకు జరుగుతుంది ? అలా జరగాలని – నా ఉద్యోగం వుండాలని రాసుంటే !...." కళ్లల్లో నీళ్ళు తిరుగుతుంటే చెప్పలేక ఆగేడు చక్రవర్తి.

జేబులోంచి రుమాలు తీసి కళ్ళద్దుకుని ఆఫీసులో జరిగిన తంతంతా వివరించి చెప్పాడు చక్రవర్తి.

అంతా విన్న సురేష్ అడిగేడు—

"ఐతే మీ సూపర్‌వైజర్‌గారి యాభై రూపాయలు ఎవరు తీసినట్లు ?"

"అది తేలిస్తే నేనెందుకిలా అవడం?"

"అతనికి నీవేమైనా బాకీయా ?"

"ఆఁ ! ఇందాక చెప్పానుగా–యాభై రూపాయలివ్వాలని ! ఆ రోజు నిన్ను దక్కముందు మా సూపర్‌వైజర్‌గార్ని మరో యాభై రూపాయలు అప్పిమ్మని అడిగేను. అప్పటికే నేనతనికి బాకీవుండటంవలన–ఆ రోజు తన దగ్గర డబ్బులేదన్నాడు. అతన్ని ఆ రోజు అడక్కుండా వుంటే ఎంత బావుణ్ను ! ?"

"నీదొట్టి మట్టిబుర్రరా ? చేయని తప్పుకి (నేరానికి) శిక్షెందుకు అనుభవించాలి ? చెప్పలేకపోయావా ?–ఆ డబ్బు నీకెలా వచ్చిందో ! అవసరమైతే నాదగ్గరికి రాలేకపోయావా? వాళ్ళనోళ్ళు మూయించేవాణ్ణిగా !" అని సానుభూతిగా చక్రవర్తికేసి చూశాడు–సురేష్ !

"సరిగ్గా మా సూపర్‌వైజర్‌గారు చెప్పిన నోట్లే నా పర్సులో వుండటం– అదీ సరిగ్గా యాభై రూపాయలేవుండటం– నెలాఖరు రోజుల్లో ఎప్పుడూ లేంది డబ్బుండటం ....చేయని నేరాన్ని చేసినంత కంగారుని కలిగించాయ్. జరిగింది ఒహవేళ చెప్పినా – ఏదో కట్టుకథ అల్లాడ్రోయ్! – అని తోటి వర్కర్లంతా ఎగతాళి చేస్తారన్న సందేహంతో నిజాన్ని నిర్దయంగా వెల్లడించలేకపోయాను"

"సర్లే ఏడ్చినట్లే వుంది. ఇంతకీ ఇప్పుడేంచేస్తున్నావ్ ?"

"చేసేదేముంది ? మళ్ళీ వుద్యోగా

ణ్వేషన్లో పడ్డాను. రేపు మూర్తి అండ్ మూర్తి కంపెనీలో ఇంటర్వ్యూ వుంది. ఉన్నది ఒకటే వేకన్సీయట! ఆ ఉద్యోగానికి కావాల్సిన అర్హతలన్నీ నాకున్నా అదొస్తుందన్న నమ్మకం మాత్రం నాకు లేదు"

"మూర్తి అండ్ మూర్తి కంపెనీలోనా? ఫర్లేదు ధైర్యంగా వెళ్ళు ఇంటర్వ్యూకి. నీకు తప్పకుండా వస్తుందా వుద్యోగం" అంటూ మిత్రుడికి ధైర్యాన్ని నూరిపోశాడు – సురేష్,

"అయ్యగారున్నారా ?"

"ఆఁ! ఉన్నారు. బాబూ! బాబు! గారితో ఏఁవైనా పనుండి వచ్చేరా ?"

"అవును ?"

ఆ గదిలో కూర్చోండి. బాబుగారితో చెప్పొస్తా."

"అలాగే !"అంటూ నౌకరు రామయ్య చూపించిన గదిలోకి వెళ్ళి కూర్చున్నాడు చక్రవర్తి.

ఐదు నిముషాలు ముందుకి జరిగాయ్.

అయ్యగారంటే చక్రవర్తిని ఇంటర్వ్యూ చేసిన మూర్తి కంపెనీ తాలూకు ఆఫీసర్లలో ఒకరు. కేవలం ఫార్మాలిటీ కోసమే ఇంటర్వ్యూలు జరుగుతున్నాయన్న విషయం చక్రవర్తి తెల్సుకోడం వలన ఆఫీసర్ని ఇంటి దగ్గర కల్సుకుంటే – ఎందుకైనా మంచిదన్న ఆశతో ఆ వుద్యోగం తనకొచ్చేట్లు చేయమని ప్రాధేయ పడ్డంకోసం వచ్చేడు చక్రవర్తి.

ఉద్యోగం తనకొస్తుందో రాదో ?.... అన్న ఆలోచనల్లో కొట్టుకుపోతున్న చక్రవర్తిని చూసిన ఆఫీసర్గారు తనొచ్చారని తెలియచేయడానికి సంకేతంగా చిన్నగా దగ్గుతూ అతనికెదురుగా వున్న కుర్చీలో కూర్చున్నారు చక్రవర్తి కంగారుగా లేచి, "నమస్కారం సార్ !" అన్నాడు.

"ఏఁవిటి ; తఁవరెవరు ? ఎందుకొచ్చారు ?" అన్న భావం వుట్టి పడేట్లు చూశారాయన–చక్రవర్తికేసి.

"సార్ ! మీతో కాస్త పనుండొచ్చానండి ! అంటున్న చక్రవర్తితో "పని లేకుండా నా దగ్గర కెవరూ రారుగాని ముందా కుర్చీలో కూర్చుని అసలువిషయమేఁవిటో చెప్పు." అన్నారు ఆఫీసర్ గారు

చక్రవర్తి ఇబ్బందిగా కుర్చీలో కూర్చుంటూ చెప్పేడు—" సార్ ! ఈ రోజు మీ కంపెనీకి వచ్చిన ఇంటర్వ్యూ కేండేట్స్లో నేనొకణ్ణి."

"ఓహోఁ! అలాగా , నిన్ను చూసినట్లు ఇప్పుడిప్పుడే జ్ఞాపకం వస్తోంది,"

"నేను బి. ఏ. పాసై మూడేళ్ళయిందండి. ఉద్యోగం లేదండి, చాలా కష్టంగా వుందండి, నేనొక్కణ్ణేకాదండి. నాపై ఆధారపడిన వాళ్ళు మరో ఇద్దరున్నారండి. తమరు దయదలచి ఎలాగోలా మీ కంపెనీలో ఆ వుద్యోగాన్ని వచ్చేటట్లు చేయండి, మీ మేలు ఈ జన్మలో మరచిపోను.'

రెండు క్షణాలు ఆఫీసరు గారు మౌనం వహించి అన్నారు : "చూడు బాబూ ! మా కంపెనీలో వున్నది ఒకటే వేకెన్సీ. నే చెబితే మిగతా ఆఫీసరు నా మాట కాదనరు గాని – ఆ వేకెన్సీకి అప్పుడే ఎవరో మా వాళ్ళ

దృష్టిలో వున్నట్లు - ఆ వేకెన్సీని బజార్లో వస్తువుని కొన్నట్లు 'ఆ' అభ్యర్థి కొనడానికి సిద్ధంగా వున్నట్లు కూడా మా వాళ్ళంటున్నారు. ఐనా - నీ పరిస్థితిని విన్న తర్వాత నీకు సహాయం చేయాలనే వుంది. గ్యారంటీగా చెప్పలేను గాని ప్రయత్నించి చూస్తాను. ఆ తర్వాత నీ అదృష్టం."

చక్రవర్తి ఆఫీసరుగారి సహృదయానికి సంతోషిస్తూ తన పేరు, నెంబరు ఓ కాగితం మీద రాసిచ్చేడు.

ఆఫీసర్‌గారు తనిచ్చిన కాగితం తీసుకుని, "వారం రోజుల తర్వాత కన్పించు" అన్నారు

"మీకు శ్రమయిస్తున్నందుకు క్షమించండి" అంటూ చక్రవర్తి అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు.

## 6

"సార్! పోస్ట్!" అంటూ ఓ కవర్ని పోస్ట్‌మేన్ సూపర్‌వైజర్ విశ్వంకి అందించి పోయాడు.

విశ్వం కవర్ని చించి చదువ సాగేడు.

"సార్ ! నమస్కారం !

నే నెవరో మీకు తెలియదు. నేను మీకు తెలియకపోయినా నా మిత్రుడు చక్రవర్తి మాత్రం మీకు బాగా తెల్సు.

మీ డబ్బు పోయింది. చక్రవర్తి తీయలేదు. మరెవరు తీశారు ? ఏమో ? ఆ భగవంతునికే తెలియాలి ఐతే చక్రవర్తి పర్సులో నెలాఖరు రోజుల్లో కూడా అంత డబ్బెక్కడిదని కదూ మీ సందేహం ?—ఆ రోజు వాడి అవసరాన్ని గుర్తించిన నేను వాడొద్దంటున్నా వినకుండా నా చేతి వుంగరాన్ని అమ్మేసి వందరూపాయ లిచ్చాను. అవసరాలన్నీ (అప్పులు) తీరగా మిగిలిన యాభై రూపాయల్ని వుంచుకుని ఆ రోజు ఆఫీసుకి వచ్చేడు. అందులోంచి ఓ ఇరవై రూపాయలు మీకు అప్పు తీరుద్దామని కూడా అనుకున్నాడు. మిగతా ముప్పై రూపాయలు ఇంటద్దెకని అనుకున్నాడు. కాని జరిగింది మరొకటి !

అప్పట్నుంచి వాడికి వుద్యోగంలేదు. తనకి గాని-తనవారికి గాని సరిగ్గా తినడానికి కూడా లేక బాధపడుతున్నా - అభిమానధనుడైన వాడు ఎవర్నీ సహాయం అర్థించ(లే)క తనదురదృష్టాన్ని నిందించుకుంటూ మరో వుద్యోగం కోసం అహర్నిశలు ఎదురుతెన్నులు చూస్తున్నాడు

నిన్నటి రోజున మూర్తి & మూర్తి కంపెనీకి ఇంటర్వ్యూకి వెళ్ళేడు. భగవంతుని దయవల్ల ఆ వుద్యోగం వాడికొస్తే వాడి కష్టాలు గట్టెక్కినట్లే! మీలో గనుక మానవత్వం - మంచి....అనేవి వుండి వుంటే - మీ ద్వారా మావాడికి జరిగిన అన్యాయానికి ప్రతిఫలంగా మళ్ళీ వాడికి వుద్యోగం వచ్చేటట్లు చేయండి.

సెలవ్ !

చక్రవర్తి మిత్రుడు - సురేష్ !

ఉత్తరం ఆద్యంతాలు చదివిన విశ్వం మనసు బాధతో మెలితిరిగింది.

'తన మూలంగానే చక్రవర్తి పరిస్థితి దుర్భరమైంది; పాపం.' అనుకుంటుంటే అతని మనసు గతాన్ని చిత్రింప సాగింది.

* * *

ఆ రోజు ఆఫీసులో గంట గణ గణ మని మ్రోగింది.

అది కాఫీ—టీలకి విరామ సంకేతం!

పనివారంతా కేంటీన్‌కి వెళ్ళిన తర్వాత తను ఆ రోజు అటెండెన్స్ వేయడం కోసం స్టోర్లోకి వెళ్ళేడు. రిజిష్టరు కోసమని డ్రాయర్ సొరుగు తెరిచే సరికి పర్స్ కనిపించింది. ఏదో బలహీనత తనచేత ఆ పర్సుని తెరచి చూసేట్టు చేసింది.

లోపల ప్లేస్టిక్ కవర్లో చక్రవర్తి పేరు – అడ్రసు చూసి, పర్స్ చక్రవర్తి దని గ్రహించి అప్రయత్నంగా అందులోని డబ్బుని లెక్కపెట్టేడు తను. సరిగ్గా యాభై రూపాయలున్నాయ్. చక్రవర్తి తన కియ్యవలసిన బాకీ క్రింద ఆ యాభై తీసుకుంటే ?– అని మొదట అనుకున్నా ఆ ఆలోచన ఎంతోసేపు నిలువలేదు.


ఆ సమయంలో తన మిత్రుడు అన్న మాటలు గుర్తొచ్చాయ్.

"ఒరే, విశ్వం! క్రిందటి వారంలో స్టోర్ కీపర్ వుద్యోగానికి మీ ఆఫీసుకి ఇంటర్వ్యూకి వచ్చేను. నీ వారోజు సెలవులో వున్నావట. అందుకని ఆ రోజు నిన్ను కలియలేకపోయాను. మీ ఆఫీసులో ఎవరో చక్రవర్తి అనే అతను 'ఏక్టింగ్ స్టోర్ కీపర్'గా పన్చేస్తున్నాట! ఈ వుద్యోగం గ్యారంటీగా అతనికే వస్తుందని అందరూ అనుకుంటున్నారు. అతను ఏదో ఒక ఉద్యోగం చేస్తున్నాడు కాని నాకు ఆపాటి ఆదరువైనా లేదు. నీ వెలాగయినా ఆ వుద్యోగం నా కొచ్చేటట్లు చూడాలి నా ఆశలన్నీ నీమీదే పెట్టుకున్నాను...."

అవును – న్యాయంగా చూస్తే డిపార్ట్‌మెంటల్ కేండిడేట్‌కే ప్రిఫరెన్స్ ఇవ్వాలి. అలా చేస్తే చక్రవర్తికి వుద్యోగం రావటం తప్పదు. కానీ వాడికి ఏ వుద్యోగం(వూలేదే! ఎలా వాడికి వుద్యోగం వచ్చేట్లు చేయాలి ? – అని బుర్ర బద్దలు చేసుకుంటే మెరుపులాంటి ఐడియా వచ్చింది – చక్రవర్తి ఆఫీసులో వున్న మంచి పేరు ఎలాగోలా పోగొట్టటం – తద్వారా ఆ వుద్యోగాన్ని మావాడికి వచ్చేట్లు చేయడం" కాని అదెలా సంభవం ? – అని కొన్ని క్షణాలు కొట్టుమిట్టులాడిం తర్వాత మరో ఆలోచన తట్టింది. తత్ఫలితంగా చక్రవర్తి పర్సులోని నోట్లని బాగా తను గుర్తుంచుకోవడం – డబ్బు పోయిందని అందరికీ నమ్మకం కలిగేట్లు అతి చాకచక్యంగా పుకారు పుట్టించడం – తద్వారా చక్రవర్తి వుద్యోగం పోవడం జరిగిపోయాయి.

కాని తను నిజంగా చక్రవర్తి అలా రాజీనామా ఇస్తాడని కలలో కూడా అనుకోలేదు.

తర్వాత తనమిత్రుడికి తననుకున్నట్లు మానేజర్‌గారి అనుగ్రహం వల్ల వుద్యోగం రావడం జరిగింది. కాని ఆ పరిస్థితుల్లో తను తన మిత్రుడికి వుద్యోగం వచ్చేందుకు ఆలోచించగలిగేడు కాని తన మూలంగా చక్రవర్తి జీవితం నాశనమైపోతుందని మాత్రం వూహించలేకపోయాడు. తన మిత్రుడికి సహాయం చేస్తున్నానని తను మురిసిపోయాడుకాని– మరొకరికి అన్యాయం జరుగుతుందని వూహించలేకపోయాడు.



"అమ్మా - నాన్న" లో కృష్ణంరాజు, ప్రభ

పాపం చక్రవర్తి అనవసరంగా తను చేసిన ఘాతుకానికి బలై పోయాడు. తన కారణంగా పోయిన అతని వుద్యోగం మళ్ళీ తన ద్వారా వస్తేనేగాని తనకు శాంతి వుండదు. ఐతే ఎలా అతనికి మళ్ళీ వుద్యోగం వచ్చేట్లు చేయడం? ఆఫీసులో వేకెన్సీలు లేవే! ఆ మెసెంజర్ పోస్టు కూడా 'ఫిల్' ఐపోయిందే! మరెక్కడయినా ప్రయత్నించాలి. అవును అంతే. అలా చేస్తేనే తను చేసిన పాపానికి నిష్కృతి లభిస్తుంది.

## 7

వారం రోజులు ముందుకు జరిగి పోయాయ్,

ఆ రోజు శనివారం.

ఉదయం లేచిందగ్గర్నుంచి చక్రవర్తి అనుకుంటున్నాడు - ఈరోజు తనెలాగైనా ఆ ఆఫీసర్ గార్ని కలియాలి. ఆయన్ని కలిస్తే తనకు ఆ వుద్యోగం వచ్చేదీ లేందీ తెలుస్తుంది. రాక పోవడమేంవిటి? ఆయన తల్చుకుంటే అ వుద్యోగం తప్పకుండా తనకే వచ్చి తీరుతుంది............"

చక్రవర్తి ఆలోచనకి అంతరాయం కలిగిస్తూ - 'పోస్ట్!' అంటూ పోస్టుమేన్ రిజిస్టర్ కవరుతో ప్రత్యక్షమమేడు. సంతకంచేసి కవర్ని తీసుకున్నాడు. అది మూర్తి అండ్ మూర్తి కంపెనీ వాళ్ళు పంపించిన అప్పాయిమెంట్ ఆర్డర్!

'నా ప్రయత్నం వ్యర్థం కాలేదు. ఆ ఆఫీసర్‌గారి దయవల్లే నాకు ఉద్యోగంవొచ్చింది. ఆయన్నిప్పుడే కలసి కృతజ్ఞత తెలియజేయాలి' అనుకుంటూ

గబగబా ఆఫీసర్‌గారింటి వేపు నడక సాగించేడు.

ఆఫీసర్‌గారు తన ఆఫీసు రూంలో కూర్చుని ఆరోజు పేపర్ని చూస్తున్నారు.

"బాబుగోరూ! మళ్లీ ఆ కుర్రా డొచ్చారండీ!" అని రామయ్య చేసరికి ఆఫీసరుగారు– "ఏకుర్రాడు రామయ్యా?" అడిగేడు.

"అదేనండీ! కిందటోరం వచ్చేరు కదండీ! ఆ కుర్రోడు!"

ఆ మాట వినేసరికి ఆఫీసర్‌గారి ముఖంలో ఏదో అసహనం చోటు చేసుకుంది.

"పంపించు!" అన్నమాట విని రామయ్య చక్రవర్తిని ఆఫీసర్‌గారి రూంలోని పంపించేడు.

చక్రవర్తి నవ్వు ముఖంతో గదిలోకి ప్రవేశించేడు.

విష్ చేస్తూ – "సార్ మీ దయవల్ల నాకు వుద్యోగం వొచ్చిందండీ! మీరు చేసిన ఈ సహాయం జన్మ జన్మలకీ మరచి పోలేనండి, నా చీకటి జీవితంలో వెలుగు రేఖల్ని నింపిన మిమ్మల్ని పొగడకుండా వుండలేక పోతున్నాను. వారం రోజు ల్లోగా జాయిన్ అవమని అప్పాయి మెంట్ ఆర్డరొచ్చిందండీ? రేపు మంచి రోజు. జాయినవుతానండి"

ఆఫీసర్‌గారు ఆర్డర్ని చూసి చిన్నగా నవ్వుతూ – "గుడ్! ఏమైనా నీవు అదృష్టవంతుడివోయ్? అనుకున్న ట్లుగా నీకు వుద్యోగం వొచ్చింది." అన్నారు.

"నాదే ముందండి? అంతా మీదయ!" అంటూ సంతోషంగా వారిదగ్గర్నుంచి సెలవు తీసుకున్నాడు.

చక్రవర్తి వెళ్తున్న వేపు ఆఫీసర్ గారు ఆశ్చర్యంతో చూస్తుండి పోయాడు.

ఆఫీసర్‌గారలా ఆశ్చర్యంగా చక్ర వర్తి వెళ్తున్నవేపు చూస్తూ వుండిపోవ డానికి కారణం – మళ్ళీ చక్రవర్తిని చూసిందాకా ఆఫీసర్‌గారికి అతని విష యం గుర్తుండక పోవడం! ఆఫీసు విష యాల్లోపడి అతని విషయాన్ని పూర్తిగా మరచిపోవడం! అందుకే చక్రవర్తి వచ్చాడని రామయ్య ద్వారా తెల్సుకునే సరికి ఆఫీసర్‌గారి మనసులోని ఆందో ళన – కలవరం కొట్టొచ్చినట్లు అతని ముఖంలో కన్పించాయి.

అందుకే అప్పాయింట్‌మెంట్ ఆర్డర్ చూసిన ఆఫీసర్‌గారు– "గుడ్! ఏమైనా నీవు అదృష్టవంతుడివోయ్! అనుకున్న ట్లుగా నీకు ఉద్యోగం వచ్చింది!" అని మాత్రమే అన్నారు.

చక్రవర్తి మాత్రం ఆఫీసర్‌గారి దయ వల్లే తనకు ఉద్యోగం వచ్చిందని సంతో షించాడు.

ఆఫీసర్‌గారుమాత్రం తన ప్రమేయం లేకున్నా – చక్రవర్తికి అతడి అదృష్టమే అతనికి వుద్యోగాన్ని సంపాదించి పెట్టిం దని అనుకున్నారు.

కానీ—వేలంలో పాటపాడి వస్తువుని కొన్నట్లు – తన్జేసిన పాపానికి ప్రాయశ్చిత్తం కోసం సూపర్‌వైజర్ విశ్వం ఆ వుద్యోగాన్ని చక్రవర్తి కోసం కొన్నట్లు మాత్రం ఎవరికీ తెలీదు.

చక్రవర్తికి వుద్యోగం వచ్చిందని. తెల్సుకున్న సురేష్ మాత్రం అను కున్నాడు – సూపర్‌వైజర్ విశ్వంలో మానవత్వం మేల్కొంది అని.